# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లాలోని నారావారిపల్లెలో ఈరోజు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.
- ❖ పల్లె సౌభాగ్యమే.. దేశ సౌభాగ్యమని.. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.
- ❖ తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు విజ్ఞప్తి చేశారు.
- ❖ మకర జ్యోతి దర్శనార్థం అయ్యప్ప స్వామి భక్తులు వేల సంఖ్యలో శబరిమలకు చేరుకుంటున్నారు.

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లాలోని నారావారిపల్లెలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఈరోజు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం రంగంపేటలో 2 కోట్ల రూపాయల రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా కోటి రూపాయలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనానికి భూమిపూజ చేశారు. నారావారిపల్లెలో 3 కోట్ల రూపాయలతో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. అంతకముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలందరికి భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్రమైన ఈ భోగి పండుగ మీకు, మీ కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలని, పాత బాధలు పోయి సానుకూల దృక్పథంతో జీవితంలో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

==========================

తిరుమలలో సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పాలకమండలి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు పేర్కొన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... తిరుమలలో దళారీ వ్యవస్థను అరికట్టామన్నారు. అందరినీ సమన్వయం చేసుకుని

ముందుకు వెళుతున్నామని చెప్పారు. స్వచ్ఛమైన నెయ్యితో ప్రసాదాల్లో నాణ్యతను తీసుకొచ్చామన్నారు. సామాజిక మాధ్యమాల్లో టీటీడీపై అసత్య ప్రచారం జరుగుతోందని.. ప్రజలు ఇటువంటి నమ్మవద్దని చైర్మన్ విజ్ఞప్తి చేస్తూ…

(వాయిస్ 37 సెకన్లు)

=========================

పల్లె సౌభాగ్యమే దేశ సౌభాగ్యమని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పండుగ సందడితో తెలుగు రాష్ట్రాల పల్లెలు శోభాయమానంగా మారాయని, ఈ సంక్రాంతి పండుగ పల్లెల్లో ఆనందాలు, సిరి సంపదలతో సుభిక్షతను తీసుకురావాలని ఆకాంక్షిస్తూ.. భారతీయులందరికీ భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. సూర్య భగవానుడు మకర రాశిలోకి ప్రవేశించే ఈ పుణ్య సమయాన ధాన్య రాశులను లోగిళ్లకు మోసుకువచ్చే సంక్రాంతి వేళ రైతులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. రంగవల్లులు.. గొబ్బెమ్మలు.. గంగిరెద్దులు.. హరిదాసులు.. భోగిమంటలు.. పిండివంటల సమ్మేళనమే సరదాల సంక్రాంతి అని.. అలాంటి సరదాల కోసం నగరాలన్నీ పల్లెలవైపు రావడం ప్రజలకు పండుగపై ఉన్న మక్కువను తెలియజేస్తోందని పవన్ కళ్యాణ్ అన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

=========================

భారతదేశపు అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం, 144 సంవత్సరాలకు ఒక సారి వచ్చే “మహా కుంభమేళా” ఈరోజు ఉత్తర ప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో ప్రారంభమయ్యింది. పుష్య పౌర్ణమి అయిన ఈరోజు మహా కుంభమేళా ప్రారంభానికి గుర్తుగా ప్రయాగ్ రాజ్ లోని త్రివేణి సంగమంలో మొదటి పవిత్ర స్నానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సంస్కృతి, సాంకేతికతల సమ్మేళనంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ మహా కుంభమేళా కోసం అత్యాధునిక ఏర్పాట్లను చేసింది. ఇదిలా ఉండగా తెలుగు రాష్ట్రాల నుండి వెళ్లే యాత్రికుల కోసం దక్షిణ మధ్య రైల్వే 26 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ఈ రైళ్లు ఫిబ్రవరి 5 నుండి 27వ తేదీ వరకూ అందుబాటులో ఉండనున్నాయి. అదే విదంగా తూర్పు కోస్తా రైల్వే 7 ప్రత్యేక రైళ్లను మహా కుంభమేళా కోసం ఏర్పాటు చేసింది. జనవరి 16 నుండి ఈ రైళ్లు అంధుబాటులోకి రానున్నాయి.

=========================

మకర జ్యోతి దర్శనార్థం అయ్యప్ప స్వామి భక్తులు వేల సంఖ్యలో శబరిమలకు చేరుకుంటున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో పంబ నది వరకు భక్తుల క్యూలైన్లు చేరుకున్నాయి. అయ్యప్ప స్వామి దర్శనానికి 12 గంటలకు పైగా సమయం పడుతోందని ఆలయ అధికారులు తెలిపారు. రద్దీ దృష్ట్యా గత రెండు రోజులుగా కేవలం 4 వేల మందికి మాత్రమే స్పాట్ దర్శనం టోకెన్లు జారీ చేస్తున్నామని.. అలాగే ఆన్‌లైన్ దర్శనాలను కూడా తగ్గించబోతున్నామని వెల్లడించారు. రేపు సంక్రాంతి సందర్బంగా మకర జ్యోతి దర్శనం ఉంటుందని ఈ నేపథ్యంలో 40 వేల మందికి మాత్రమే ఆన్‌లైన్ దర్శనం కల్పించబోతున్నామని అధికారులు తెలియజేశారు.

విరామం

=========================

విశాఖలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి దేవస్థానం సింహచలం కొండపై భోగి పర్వదినాన్ని పురష్కరించుకొని ఈరోజు సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. తెలుగువారి సంస్కృతిని, గ్రామీణ జీవనాన్ని ప్రతిబింబించేలా ఈ రోజు భోగి మంటలు ఏర్పాటు చేసి గొబ్బెమ్మలతో ముత్యాల ముగ్గులు, చెరుకు గెడల జాలువలుతో పాటుగా డూ..డూ.. బసవన్నల విన్యాసాలు, జంగందేవర కొమ్మదాసరి, హరిదాసు వేషధారణలు, కపిలగోవు, కపిల గిత్త, ఎడ్లబండి ప్రదర్శనలతో పాటు వేదమంత్రోచ్చరణతో గోపూజా కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. భక్తుల సందడితో ఈరోజు సింహగిరిపై ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.

==========================

సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో విశాఖపట్టణం- సికింద్రాబాద్ మధ్య ప్రతి రోజు నడిచే వందేభారత్ ఎక్స్ ప్రెస్ కు బోగీలను పెంచుతూ దక్షిణ మధ్య రైల్వే నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు 8 బోగీలతో నడుస్తుండగా.. మరో 8 బోగీలను అదనంగా చేర్చడంతో మొత్తం16 బోగీలతో ఈ వందేభారత్ ఎక్స్ ప్రెస్ ప్రయాణికులకు ఈరోజు నుండి అందుబాటులోకి వచ్చింది. తాజా నిర్ణయంతో ఇక నుంచి 14 చైర్ కార్ కోచ్లలో 1,024 మంది, రెండు ఎగ్జిక్యూటివ్ కోచ్‌లలో 104 మంది కలిపి మొత్తం 1,128 మంది ప్రయాణించే అవకాశం ఉంటుంది. కాగా 20708 నెంబర్ తో ఈ రైలు విశాఖపట్టణంలో మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు బయలుదేరి.. రాత్రి 11 గంటల 25 నిమిషాలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు పయనంలో 20707 నెంబర్ తో ఈ రైలు సికింద్రాబాద్ లో ఉదయం 5 గంటల 5 నిమిషాలకు బయలుదేరి మధ్యాహ్నం ఒంటిగంట 50 నిమిషాలకు విశాఖపట్టణం చేరుకుంటుంది.

==========================

మకర సంక్రాంతి పండుగను రాష్ట్ర ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. భోగి పండుగ సందర్భంగా ఈరోజు ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సంక్రాంతి వేడుకలను ఆయన ప్రారంభించారు. తొలుత సాంప్రదాయ పద్ధతిలో ఎద్దుల బండిలో సంక్రాంతి పండుగ వేషధారణలో క్రీడా మైదానంలోకి ప్రవేశించారు. అనంతరం క్రీడా మైదానంలో ఉన్నటువంటి స్థానిక నాయకులు అధికారులతో మాట్లాడి.. వారికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. భోగి మంటల నడుమ మహిళల ఆట పాటలను, డూ..డూ.. బసవన్న ప్రదర్శనలను ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ పండుగను పెద్ద పండుగగా ఆంధ్రులు జరుపుకుంటారన్నారు. ప్రజలంతా భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను సుఖ సంతోషాలతో, భోగభాగ్యాలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు.

==========================

నూతన సంవత్సరంలో రాష్ట్రానికి నూతన పరిశ్రమలు రానున్నాయని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. భోగి పండుగ సందర్భంగా ఈరోజు ఆయన చిత్తూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... పండుగలు తరువాత పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెట్టనున్నారని.. దీంతో నూతన పరిశ్రమలు ఏర్పాటై నిరుద్యోగులకు, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఈ కొత్త సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

==========================

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడం కోసం పార్వతీపురం మన్యం జిల్లాలో ఈనెల 20 నుండి 14 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చర్మంపై రాగి రంగు మచ్చలు, నొప్పితో కూడిన నరాలు, కాళ్ళు, చేతుల కండరాలు బలహీనమవ్వడం, పాదాలు నరాల్లో తిమ్మిర్లు తదితర లక్షణాలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

==========================

==========================